

# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### జడ్జిగారికి నమస్కారం...

'సభకి విచ్చేసిన సోదరి సోదరీమణులకీ, వేదికని అలంకరించిన పెద్దలకీ, జడ్జిగార్లకీ అందరికీ నమస్కారం!"

అని ప్రతి సభకీ విధిగా హాజరయ్యే ఓ ప్రముఖ పారిశ్రామిక వేత్త స్పీచ్ మొదలెట్టాడు. 'జడ్జిగార్లా?' అని ఉలిక్కిపడ్డాను. తరువాత తెలిసింది ఆ జడ్జిగార్లంటే నేనూ నా పక్కన కూర్చున్న వాళ్ళూ అని. నాటికల పోటీకి మేం 'జడ్జి'లుగా.. అదే జడ్జీలుగా... వచ్చాం.

ఓ పద్నాలుగేళ్ళుగా టీ.వీ రంగంలో, కథ, స్క్రీన్‌ప్లే, స్క్రిప్ట్ రైటర్‌గా ఉన్నందుకూ, ఇంకా చిత్ర పరిశ్రమ అనే ఈ విచిత్ర రంగంలో ఒక్కగానొక్క స్త్రీరచయితగా మనగలుగుతున్నందుకూ, ఒక గౌరవంగా నన్ను కొందరు ఇలా జడ్జిగా పిలుస్తుంటారు.

చిన్నప్పుడు మేం ఆర్. టిసీ వాళ్ళ కల్చరల్ ప్రోగ్రామ్స్‌కి వెళ్ళేవాళ్ళం. మా అమ్మ పాట తప్పనిసరిగా ఉండేది కనక, ఆవిడ వెంట నేనూ ఉండేదాన్ని. వరుసగా అన్ని డిపోల నుండీ నాలుగురోజులపాటు ఎడతెరిపి లేకుండా నాటక, నాటిక పోటీలు జరిగేవి.

గుంటూరు డిపో, చిలకలూరిపేట డిపో, రాజమండ్రి డిపో, హైదరాబాద్ డివిజన్, కడప డిపో... కరీంనగర్ డిపో ఇలా రకరకాల యాస భాషలతో ఆ ఊర్లనుండి వచ్చిన ఆర్.టీ.సీ ఎంప్లాయీస్, రంగస్థలం మీద సత్తా చూపించేవాళ్ళు. నా దృష్టంతా ముందు వరుసలో కూర్చున్న ఓ నలుగురి మీద ఉండేది. వాళ్ళ గుండెల దగ్గర 'న్యాయనిర్ణేతలన్న' బాడ్జీలు పెట్టుకుని, మొహాన నవ్వూ, తుళ్ళూ, బాధా, కోపం లేకుండా కేవలం సహనం మాత్రమే తెలిసినట్లుండేవాళ్ళు. వాళ్ళకి కూల్ డ్రింక్సూ, మధ్యలో టిఫిన్లూ పెట్టేవారు. కళాకారులు వాళ్ళు ఎదురైతే అతి వినయంగా ఒంగి నవ్వుతూ విష్ చేసేవాళ్ళు. మొత్తానికి ఆ పదవులు చాలా విలువైనవి అని నాకు చిన్నప్పుడే అర్థమైపోయింది. అంతే కాదు ఏ నాటకంలో నైనా చిన్నపిల్ల కావలసివచ్చినప్పుడు నన్ను తీసుకెళ్ళి ఏ చాక్లెటో చేతిలో పెట్టి మొహానికి రంగు వెయ్యడం వలన రంగస్థలం అంటే కూడా బాగానే అర్థం అయింది. మోజు కూడా పెరిగింది.

ఇంకా మా కుటుంబంలో రసపోషణ విషయానికొస్తే, మా నాన్నగారికి కళలంటే పడదని మా అమ్మ ఉత్తిపుణ్యాన ఆడిపోసుకునేది కానీ, ఆయనకి కళాపోషణ రిటైరయ్యేనాటికి పెచ్చుమీరిపోయి భాగ్యనగరంలో ఎక్కడ నాటకపోటీలైనా ఒక కుర్చీ రిజర్వ్ చేసుకునే స్థాయికి ఎదిగింది. ఒక రెండు లైన్లు మా బాబాయిలూ, వాళ్ళ మేనత్త కోడుకులూ, మా నాన్నగారూ ఉండేవారంటే

అతిశయోక్తికాదు! ఎందుకంటే మా నాన్నగారి మేనత్తకొడుకు కోన ప్రభాకరరావుగారు. ఆయన నేను కళ్ళుతెరిచే నాటికి పాండిచేరికి గవర్నర్ అనే నాకు తెలుసు కానీ, ఆయన ఒకప్పుడు సినిమా హీరో, దర్శకుడూ, నిర్మాతా అని తరువాత తెలిసింది. మా డా.డి రామానాయుడుగారు బాపట్లలో ఆయన పేరుమీద ఆడిటోరియం కట్టించానని చెపుతుంటారు. సో. ఆయన పిల్లలూ, మనవలూ కూడా ఈ నాటకరంగమందు అభిరుచి కలవారై, హాజరవుతుంటారు.

ఇంక ప్రత్యేకంగా చెప్పాల్సింది మా పరాంకుశం బాబాయ్ గురించి. ఈయన నాటకానికి బలవంతంగానో, బతిమాలో ఇద్దరు ముగ్గుర్ని తనతో పట్టుకు రావడమే కాక వాళ్ళ కోసం మా పిన్ని చేత చేగోడీలూ, కారప్పూసా, పాలకాయలూలాంటివి కూడా చేయించి పట్టుకొచ్చి కళాపోషణని చాటుకుంటాడు. నాకు ఊహ వచ్చాక బాగా నచ్చిన నాటకం, 'చీమ కుట్టిన నాటకం' అది మా గురువుగారు శ్రీ యండమూరి వీరేంద్రనాథ్ గారు వ్రాసినది.

అది వ్రాసి ఇన్ని దశాబ్దాలైనా, ఇంకా నాటక రంగాన్నీ, మా టీ.వీ.రంగాన్నీ, నడుం ఒంగిపోయి, భుజం మీద కండువాతో సోఫాలు దులుపుతూ 'బాబుగారూ...' అని అన్నింటికీ కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ, అప్పుడప్పుడు చనిపోయిన ఇంటి యజమానురాలి ఫోటో దగ్గరకి వెళ్ళి (ఏ సావిత్రి ఫోటోనో, సౌందర్య ఫోటోనో పెడతారు)డగ్గుత్తికత్తో, భారీ భారీ డైలాగులు చెప్పే పనివాడి పాత్ర మారలేదు!

అప్పుడు ఆ నాటిక ఎవరు వ్రాసారో తెలీదు కానీ పడి పడి నవ్వాను. ఆ తరువాత దూరదర్శన్ తెలుగునాట అవతరించిన తొలినాళ్ళల్లో కోటా శ్రీనివాసరావుగారూ, దేశిరాజు హనుమంతరావు గారు వాళ్ళు వేసిన 'ఇల్లు అలికిన ఈగ' చూసి అంతే పరమానందం చెందాను.

ఇలా నాటకరంగం మీద మక్కువ పెంచుకున్నా, నా వంతు కృషి ఏమీ చెయ్యలేదే అని దిగులుపడుతూ ఉంటే, కొందరు పెద్దలు నగరంలో ప్రముఖంగా, సినీ పరిశ్రమ మొత్తం హాజరయ్యేలాంటి నాటకపోటీలకి వరుసగా ఐదు సంవత్సరాలు నన్ను న్యాయనిర్ణేతగా నిర్ణయించి, నేను చిన్ననాడు మనసుపడ్డ ఆ ఆసనం యందు నన్ను కూర్చోపెట్టారు. ఇంకేం! నేను అపరిమితానందభరితురాలినయ్యాను. ఆ తరువాత తెలిసాయి పాట్లూ, కునికి పాట్లూ అంటే!

నాకు అటూ ఇటూ ఐదుగురు ఉద్దండ పండితుల్లాంటి, నాటక సినీరంగానికి చెందిన పెద్దలని కూర్చోపెట్టారు.

అందులో ఒక పెద్దాయన నాకు న్యాయనిర్ణేతల కుండే లక్షణాలనీ, అనుసరించాల్సిన విధానాలనీ, మొదటిసారి పుస్తకం చదివి మంగళగౌరీ వ్రతం చేసుకునే వాళ్ళకి ఎంత విపులంగా చేపుతారో అంత విపులంగా విడమర్చి చెప్పారు. అందులో కొన్ని విలువైన సూక్తులు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

1. 'జడ్జీలు ఎంత నవ్వొచ్చినా, నోరంతా తెరిచి, కడుపు చేతపట్టుకుని, ముందుకి ఒంగి నవ్వకూడదు'

2. 'గుండె చెమ్మగిల్లినా కళ్ళు చెమ్మగిల్లకూడదు. అవసరమైతే కళ్ళద్దాలు వాడొచ్చు. ఆ నాలుగురోజులూ నేను కాటుక పెట్టుకోవడం మానేస్తే బెటర్!'

3. 'తెర మీద ఎంత రణగొణ ధ్వనిగా, అరుపులూ, కేకలూ, మధ్య మధ్యలో శోక సముద్రంలో ముంచే విధంగా హార్మోనియం స్వరం, తీన్ మార్ తాళంలో డప్పు వినిపిస్తున్నా, హాయిగా రిలాక్సెడ్ గా వెనక్కివాలి నిద్రపోగలగడం, జడ్జీగా మనకున్న అనుభవాన్ని సూచిస్తుంది.' ఇది నాకు ఒంటపట్టక అనుభవశీలిని కాలేకపోయాను.

4. ఒక్కోసారి నాటకం మనకి నచ్చకపోయినా, హాలులోంచి పెద్ద పెట్టున చప్పట్లు వినిపించి, అసంకల్పిత చర్యగా మన చేతులూ చప్పట్లు చరుస్తుంటాయి. అలాంటప్పుడే జాగురూకతలో ఉండాలి. ఆ చప్పట్ల మోత హాలు అంతటా వినిపించిందా, లేక ఏదో ఒక

మూల నుండి వచ్చిందా అని గమనించాలి. అలా ఒక మూలనుండి వచ్చినట్టైతే, వాళ్ళ ఊరివాళ్ళో, బంధువులో అక్కడ గుంపుగా కూర్చుని, డైలాగ్ మనం ఫాలో అయ్యే లోపే అలా చప్పట్లతో మైమరపిస్తుంటారు.'

5. 'ఇంక వ్యక్తిగత ప్రాధాన్యతలు, వీటిని అస్సలు పట్టించుకోకూడదు. నిన్న సాయంత్రం కత్తి పట్టుకుని రౌడీ రంగడి వేషంలో వీరంగం వేసిన నటుడు అద్భుతం అని ఈ నాడు గుండె పట్టుకుని, ఆవేదనతో ఆడపిల్లల తండ్రిగా కనిపించిన అదే నటుడి మీద అదే ప్రేమ చూపించరాదు. ఆ పాత్ర వేరు. ఈ పాత్ర వేరు. నిన్న 'ఆహా' అనిపించిన నటుడే, ఈనాడు నసపెట్టి 'అయ్యో' అనిపించవచ్చు.'

6. 'స్త్రీ పాత్రధారులు కామన్‌గా ఉంటారు కాబట్టి వాళ్ళే నరసరావుపేట నుండీ, అనంతపురం నుండీ బళ్ళారి నుండీ కూడా వేసే నాటకాలలో కనిపిస్తుంటారు. ప్రాంతీయ అభిమానం ఇక్కడ పనికి రాదు. అక్కడినుండి రైలు ఫేరు పెట్టుకుని తీసుకురారు. ఇక్కడ స్థానిక కళాకారిణులే వేస్తుంటారు.'

7. 'జడ్జీ బాడ్జీ ధరించాక, గ్రీన్ రూంలలోకి వెళ్ళరాదు. మన మేనత్త కొడుకో, బాగా ఆత్మీయులైన శ్రీ చిట్టెన్ రాజుగారో ఉన్నా నిర్భావంగా చూడాలే తప్ప, పలకరించరాదు. నమస్కారాలు స్వీకరించాలే తప్ప, పూసుకుని మాట్లాడరాదు.'

8. 'పక్కవాళ్ళ వల్ల ప్రభావితం కారాదు.' ఇది చాలా ముఖ్యమైన పాయింట్. నా పక్కన కూర్చున్న జడ్జికి ఫలానా అప్పలసామి అంటే పడదనుకోండి,ఆ ఊరి కళానికేతన్ నుండి సో ఎండ్ సో అప్పలసామి అన్న పేరు ఎనౌన్స్‌మెంటులో వినపడగానే, పెద్దగా ఆవలిస్తాడు. చేతులు పైకెత్తి, వెనక్కి జార్లగిలబడి, ఇంక కాసేపు నిద్రపోవచ్చు ఉట్టి సోదిగాడు అనొచ్చు.' మనం కంగారు పడకూడదు. ఇతను నాటకాలు వ్రాసే, లేదా వేసే రోజుల్లో అతను ఇతనికి కాంపిటీటర్రై, చాలా కప్పులు కొట్టుంటాడు. అదీ అసలి కడుపు మంట. అతను పడుకున్నా మనం శ్రద్దగా నాటకం చూడాలి.

9) 'కొన్నిసార్లు అందరి చేతా చప్పట్లు కొట్టించిన డైలాగుల్ని నోట్ చేసుకోవాలి. అద్భుతంగా నటించిన నటుడ్ని పాత్రలో, నిజం పేరుతో నోట్ చేసుకోవాలి. ఎందుకంటే విజయనగరం, వాల్తేరు నుండి వచ్చిన వాళ్ళల్లో సగం సన్యాసిరావులూ, అప్పల నరసయ్యలూ, సిమ్మాద్రిలూ, కరీంనగర్, నిజామాబాద్ నుండి వచ్చిన వాళ్ళల్లో మల్లేషులూ, యాదగిరిలూ, కాకినాడ నుండి ఒకేనాటికలో ఇద్దరు ముగ్గురు రామారావులూ, రాజమండ్రీ నుండి వెంకట రమణపేరు స్త్రీ, పురుష పాత్రధారులిద్దరికీ ఉండే అవకాశం ఉంటుంది.

10) 'కొన్ని నాటకాలు అస్సలు అర్ధం కాని పద్ధతిలో ఉంటాయి. 'స్రియలిజం' అంటారట. అలాంటప్పుడు వాళ్ళని 'సత్యజిత్‌రే'లుగా భావించేసి మార్కులు ఇవ్వకుండా, అర్ధమైనట్లు తలలూపుతున్న పక్క జడ్జీలని అర్ధం వివరించమని భేషిజం లేకుండా అడగాలి.'

11) 'జడ్జీలకి మధ్యలో విరామలో ఇడ్లీలూ, కాఫీ గెస్ట్ రూంలో తెప్పించి పెడతారు. కేంటిన్ కెళ్ళి వేడి వేడి మిరపకాయ బజ్జీలు తినాలని పరిగెత్తకూడదు. అక్కడ నిలబడ్డ తలలు పండిన నలుగురు మహానటులు మనం అంత దాకా ఫస్ట్ ప్రైజ్ ఇద్దాం అనుకుంటున్న కుటుంబయ్య కుటుంబాన్ని మన చేతే పరమ బేవార్సు అని ఒప్పించి అస్సలు మనకి నచ్చని ఏ కుచేల సంతానానికో ఆ ప్రైజు వచ్చేట్లు చెయ్యగలరు.'

12) 'ఆఖరిగా మనకి మంచి ధైర్యం, పిక్క బలం వుంటే మంచిది. ఎందుకంటే ఆఖరి రోజు ఫలితాలు వెల్లడించాక, 'జడ్జీలు న్యాయంగా వ్యవహరించారండీ' అని ఎవరూ మెచ్చి మేకతోలు కప్పరు. బహుమతి రాని ప్రతి వాళ్ళూ 'అసలీ జడ్జీలకి ఏం తెలుసని పట్టుకొచ్చారూ? ఒక్కళ్ళకి 'ఓ' అంటే 'ఢం'రాదు. వీళ్ళ సంగతి చూడాలి' అంటారు.

కొందరు పూలదండలతో, మెమెంటోలలో వెళ్ళే జడ్జీలని నిలేసి మొహం వాచేట్లు తిడతారు కూడా.

బలవంతులైతే కుర్చీలూ, గ్రటా హాల్లో విరగ్గొట్టి, గొడవ కూడా చేసే ఛాన్స్ ఉంది.

మన శాసనసభంత కాకపోయినా అసంతృప్తి వ్యక్తం చేసే విధానాలు అనేకం ఉంటాయి.

ఏ రవీంద్ర భారతిలోనో క్రిక్కిరిసిపోయి, వచ్చిన జనాన్ని అందర్నీ కూర్చోపెట్టలేక, బాల్కనీ కూడా నిండిపోయి కనిపించే ఈ నాటక పోటీలని చూసి, 'ఔరా! జనానికి నాటక రంగం అంటే ఎంత మక్కువా?' అని ఆశ్చర్యపోరాదు! ఎందుకంటే, ఇవే నాటకాలకి టికెట్టు పెడితే హాల్లో బలవంతంగా టిక్కెట్టు కొన్న పాతిక తలకాయలు తప్ప ఉండవు.

ఏ పొరుగు రాష్ట్రంలో లాగా 'థియేటర్' అంటే గౌరవం. థియేటర్ ఆర్టిస్టని గొప్పగా చూడడం మన తెలుగు వాళ్ళు చెయ్యరు. రంగ స్థలం మీద విజృంభించి నటించి, చప్పట్లతో హోరెత్తించే ఎందరో నటీనటులకి టీ.వీ, సినిమాల్లో అరనిమిషం వేషం ఇచ్చి, కెమేరా సెన్స్ నేర్చుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్లు చీవాట్లు పెట్టడం నాకు తెలుసు!

అసలు నాటకం అంటే నాకు గౌరవం, ఆరాధనా కలిగించిన సమాజం 'సురభి' చిన్నప్పుడు 'మాయాబజార్' చూసాను. పైనుండి చందమామా, తారలూ, స్క్రీన్‌ని సగం చీకటిగా, సగం వెలుతురిగా చేసి హీరో హీరోయిన్ల డ్యూయెట్లూ. ఘటోత్కచుడి వివాహభోజనం సీన్లో పాత్రలు గాల్లోకి ఎగరడం, శశిరేఖ మంచం స్టేజ్ మీద నుండి గాల్లోకి లేచి పయనించడం, ఒకటనేమిటి, అది కొంచెం వనరులతో. చాలీచాలని డబ్బులతో ఆ సంస్థ ఇప్పటికీ నాటక రంగానికి చేస్తున్న సేవకి కళాభిమానులు అందరూ తలలు వంచి నమస్కరించాలి!

ఎవరైనా ఆర్టిస్టులు వేషం కోసం నా దగ్గరకి వచ్చి 'సురభి' నుండి వచ్చాం అని చెప్పగానే నేను అప్రయత్నంగా లేచి నిలబడి, వాళ్ళకి కుర్చీ తెప్పించాకే కూర్చుంటాను. అది కూడా చెయ్యకపోతే ఈ రంగులు వేసుకునే వాళ్ళవల్ల సంపాదించే మేము, మమ్మల్ని మేం క్షమించుకోలేం!

అప్పటిదాకా పొయ్యి ఊదే ముసలమ్మ సడెన్‌గా లేచి మొహానికి మేకప్పు వేసుకుని సుభద్ర అయి పద్యంలో వేదిక మీద కొస్తుంది.

తన ఈడు పిల్లలతో గచ్చకాయలాడుకునే పసిపిల్ల చిన్నారి శశిరేఖ అయి నృత్యం చేస్తుంది!

కొయ్యగుర్రాలూ, ఎగిరే ఉయ్యాలలూ చేసే నడుంబిగించిన తాత శకునిగా మారిగెడ్డం నిమురుకుంటూ పాచికలతో తెరమీద ప్రత్యక్షం అవుతాడు!

ఒకే కుటుంబం వాళ్ళు నాటకంలో పుట్టి, కడదాకా నాటకంలో జీవించడం... ఒక్క సురభి వాళ్ళకే చెల్లింది! ఎక్కడ మరాఠీ దేశం నుండి పొట్టచేతపట్టుకుని వచ్చి, ఇక్కడ మనని ఇన్నేళ్ళుగా అలరిస్తున్న ఆ వంశీయులకి శతసహస్ర వందనాలు!

ఇప్పటిదాకా నాటక రంగంతో నాకున్న అనుబంధం, జడ్జీగా నా అనుభవాలూ చెపాను. ఇక టీ.వీ రంగానికొస్తే, 'నంది' అవార్డులకి న్యాయనిర్ణేతగా మూడు దఫాలు కమిటీలో ఉన్నాను.

అది వర్ణించనలవి కాని అనుభవం!

మామూలుగా ఎవరైనా రోజుకి ఏ రెండు మూడు గంటలో, లేదా తలకి ఇష్టమైన మూడు నాలుగు ప్రోగ్రాములో చూసి టీ.వీ ఆఫ్ చేసేస్తారు.

కానీ జడ్జీలు ప్రొద్దుట పది నుండి సాయంత్రం ఐదు దాకా మధ్యలో ఓ గంట భోజన విరామం వదిలేసి టీ.వీ. సీరియల్స్ చూడాలి.

ఏకబిగిన పదమూడు ఎపిసోడ్లు ప్రతి సీరియల్ చూడాలి! బయటికి వచ్చేసరికి 'నేను గజనీ మహమ్మద్‌ని కదా... ఇక్కడ ఉన్నానేంటీ?... అత్తగారికి విషం కలిపి ఇచ్చేవేళ అయింది.. ఇంకా నేను ఇంటికి వెళ్ళలేదేంటీ?.. పిల్లాడి స్కూల్ బస్ ఇంకా రాలేదు. ఎవరైనా కిడ్‌నాప్ చేసారేమో.. కత్తుల రత్తయ్యకి ఫోన్ చేద్దామా! మా మావగారు విల్లులో అత్తగారికి రాసిన ఐదువందల కోట్ల ఆస్తికే నేను

ఏకైక వారసురాలినవ్వాలంటే ఏం చెయ్యాలి?.. ఈ బర్తడేకి ముప్పై లక్షల వజ్రాల హారం పనిమనిషికి గిఫ్ట్‌గా ఇచ్చేద్దామా?' లాంటి ఆలోచనలు వస్తుంటాయి.

ఇంక డెయిలీ సీరియల్స్ ప్రారంభంలో మనకి బాగా తెలిసిన, చదివినా నవల్లా ఉన్నా, కాలం గడుస్తున్న కొద్దీ, సోషల్ సబ్జెక్ట్స్ సోషియో ఫాంటసీలుగా, కొన్ని అతీంద్రియ శక్తులతో కూడుకున్న చాతబడుల సీరియల్ లుగా, అప్పట్లో బాగా ఏ సినిమా అయినా ఆడితే, అందులో ఉన్న పునర్జన్మల వృత్తాంతమో, లేదా క్రైమ్ పాయింట్ పుట్టుక మర్చిపోయి ఆ సీరియల్ స్వభావాన్ని మార్చేసుకుంటూ ఉంటుంది!

కమిటీలో మనం ఉన్నాం అన్న విషయం సర్క్యులర్ చదివిన మనకి అర్థం అయ్యేలోపే బోలెడు ఫోన్ కాల్స్ వస్తాయి. "మా ఫలానా ఒళ్ళు గగుర్పొడిచే సీరియల్‌కి ప్రథమ బహుమతి వచ్చేట్లు చూడమనీ, మీరుండగా మాకేం భయం.. హి...హీ...హీ... అనీ, మిగతా పదిమంది జడ్జీలూ మా వాళ్ళే, మీరే... "అనీ నానుస్తూ, తేనుస్తూ, కొన్ని బెదిరిస్తూ, కొన్ని బతిమాలుతూ కాల్స్ వస్తాయి! అస్సలు చెదరకూడదు.... బెదరకూడదు! గీతలో కృష్ణుడు చెప్పినట్లు భారం ఆయన మీద వేసి కర్తవ్యం నెరవేర్చాలి!

నేను ఒక ఛానెల్‌కి సీరియల్ వ్రాసేటప్పుడు, ఆ ఛానెల్ ఎం.డీ. వ్రాసిన ఏ సీరియల్‌కీ, కథ, మాటలూ, స్క్రీన్‌ప్లే, పాటలూ, నటనా... దేనికీ ఒక్క 'నంది' కూడా రాకపోవడంతో, నన్ను పిలిచి 'మీకేం అర్హత ఉందని న్యాయనిర్ణేతగా వెళ్ళారూ? నా టాలెంట్‌ని పరీక్షించగలిగేది అప్పటి బి.ఎన్.రెడ్డిగార్లూ, నరసరాజు గార్లే.. మీరంతా కాదు!' అని తెగతిట్టి పంపించాడు. ఇలా మనని ఎందరికో శత్రువులుగా మార్చగలిగే శక్తి ఈ న్యాయనిర్ణేత పదవికే ఉంది.

నా ఉద్యోగం ప్రస్తుతం ఫిక్షన్ కన్‌సల్టెంట్‌గా, స్క్రిప్ట్ సెలెక్ట్ చెయ్యడమే! ఎవరి స్క్రిప్ట్ రిజెక్ట్ చేసినా, ఇలాగే 'నీకేం అర్హత ఉందని..' అంటూ నన్ను త్రాసులో నిలబెట్టి నా జ్ఞానాన్నీ, అనుభవాన్నీ తూస్తుంటారు.

*మానవుడు ఓటమిని స్వీకరించగలిగినప్పుడే నిజమైన విజేత అవుతాడు!*

పక్కవారి సీరియల్‌లో తప్పులు ఎన్నేవారికి తన సీరియల్‌లో ఒక్క తప్పూ కనపడదంటే అతిశయోక్తికాదు!

జడ్జీలు జడ్జీగా ఉంటే ప్రోబ్లమ్స్ తక్కువ! మెరికల్లా ఉంటేనే మెరిట్ గురించిన వాగ్వివాదాలు వస్తాయి.

నా అమెరికా పర్యటనలో చాలా స్టేట్స్‌లో వంగూరి చిట్టెన్ రాజుగారు రాసిన నాటికలు వేసిన వాళ్ళని కలిసాను. వాళ్ళల్లో చాలామంది ఆయనని చూడలేదుట కూడానూ! అయినా హాయిగా ఆయన నాటకాలు ఆడుకుంటున్నారు!

'నాకేం వస్తుంది?' అని ఆలోచించకుండా ఆయన నాటకాలు వేసుకోనిస్తున్నారు!

'నాకేం వస్తుంది?' అని ఆలోచించకుండా మా కిరణ్‌ప్రభగారు పత్రిక నడిపేస్తూ సాహితీ సౌరభాలు పంచేస్తున్నారు! ఎవరి పనివాళ్ళు చేసుకుంటున్నారు! పక్కవాడి పని గురించి ఆలోచిస్తేనే వస్తుంది తంటా! అలా కాకుండా ప్రవాసాంధ్రులంతా ఇలా హాయిగా, ఆనందంగా ఆడుతూ పాడుతూ పని చేస్తుంటే అలుపూ సొలుపూ ఉండదు గాక ఉండదు!

తెలుగు నాటక రంగం వర్ధిల్లాలి!